క్లుప్తంగా

కుట్టుమిషన్లు పంపిణీ

కోడూరు: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందించిన కుట్టుమిషన్లను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా సోమవారం మహిళలకు అందించారు. మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నెల రోజుల నుంచి మహిళలకు కుట్టుమిషన్లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మచిలీపట్నంకు చెందిన రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన ప్రతినిధులు ఈ శిక్షణను ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసిన 35మంది మహిళలకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై కుట్టుమిషన్లతో ట్రైనింగ్ సర్టిఫికెట్‌ను అందించింది.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

చిలకలపూడి(మచిలీపట్నం): దివ్యాంగులు, వయోవృద్ధులు రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు సోమవారం తెలిపారు. ఇందుకోసం వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ వి.కామరాజును నోడల్ అధికారిగా నియమించినట్టు తెలిపారు. వారికి అవసరమైన వీల్‌చైర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

తాడేపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం తాడేపల్లిలో టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల నిజాయతీ

చల్లపల్లి: తమకు దొరికిన పర్సును విలేకరులు పోలీసుల సహకారంతో యజమానికి అప్పగించి నిజాయితీ నిరూపించుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం చల్లపల్లికి చెందిన విలేకరులు పెనుమూడి శ్రీనివాసరావు, షేక్ ఎజాజ్ అహ్మద్ లక్ష్మీపురం వెళ్లి వస్తుండగా జాతీయ రహదారిపై పర్సు లభించింది. పర్సులో రూ.50వేల విలువైన బంగారం, రూ.2వేలు నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయి. వెంటనే ఈ సమాచారాన్ని చల్లపల్లి ఎస్ఐ సీహెచ్ చినబాబుకు తెలియజేశారు. పర్సులో ఉన్న ఫోన్ ద్వారా పలువురికి ఫోన్లు చేసి పర్సు పోగొట్టుకున్న వారు బంటుమిల్లికి చెందిన మాగంటి సత్యన్నారాయణ - శివపార్వతి దంపతులుగా గుర్తించారు. ఘంటసాల మండలం చిలకలపూడి వెళుతూ పర్సు పోగొట్టుకున్నట్లు నిర్ధారించుకున్నారు. చల్లపల్లి పోలీస్‌స్టేషనులో సత్యన్నారాయణ దంపతులకు ఎస్ఐ సమక్షంలో పర్సు అప్పగించారు.

జనఔషధ కేంద్రం ప్రారంభం

కోడూరు: ఉల్లిపాలెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనఔషధ కేంద్రాన్ని (జనరిక్ మెడికల్ షాపు)ను ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌కు వారు శంకుస్థాపన చేశారు.

కాంట్రాకు ఉద్యోగుల హర్షం



చిలకలపూడి(మచిలీపట్నం): వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరిస్తూ సోమవారం నియామక పత్రాలు ఇవ్వటం పట్ల కాంట్రాక్టు ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయిని సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ

కృత్తివెన్ను: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు సోమవారం పట్టాలను అందజేశారు. మండల పరిధిలోని కృత్తివెన్ను గుడిదిబ్బ గ్రామంలోని లేఅవుట్‌లో గల 150 మందికి పట్టాలను అందించినట్లు స్థానిక పార్టీ నాయకుడు తిరుమాని రమేష్ తెలిపారు.

రెడ్‌క్రాస్ సహాయం

గూడూరు: మండలంలోని పోలవరంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయి నిరాశ్రయురాలైన అమృత అంజలి కుటుంబానికి రెడ్ క్రాస్ సంస్థ కృష్ణాజిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు సోమవారం హౌస్ టెంట్, వంటసామగ్రి, దుస్తులు అందజేశారు.

వామపక్షాల ధర్నా

చల్లపల్లి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీజేపీ ఎలక్టోరల్ బాండ్స్ నివేదికలు తక్షణమే బయట పెట్టాలని సీపీఎం కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌బీఐ శాఖ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక దళితవాడలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవన నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు సోమవారం శంకుస్థాపన చేశారు.

జగనన్న గెలుపు పేదల జీవితాలకు మలుపు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- 7369 మంది లబ్ధిదారులకు రూ.13.76 కోట్లు పంపిణీ



నాగాయలంకలో లబ్ధిదారులకు చెక్కు అందించిన ఎమ్మెల్యే రమేష్ బాబు, కడవకొల్లు, కొక్కిలిగడ్డ తదితరులు

రేమాలవారిపాలెం(నాగాయలంక): వచ్చే ఎన్నికలలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపు పేదవర్గాల జీవితాలకు మరో పెద్ద మలుపు కానుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో రేమాల వారిపాలెంలోని నాగాయలంక మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం నాలుగో విడత చేయూత పథకం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమగ్ర మహిళాభ్యున్నతి కోసం సదాశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం 3,376మంది లబ్ధిదారులకు రూ.6.33 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. తొలుత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. చెక్కుల పంపిణీ అనంతరం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ జి.రవిబాబు అధ్యక్షత వహించారు.

అవనిగడ్డలో 1499 మందికి చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: మహిళలకు ఆసరా కల్పించేందుకు చేయూత పథకాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద సోమవారం నాలుగవ విడత చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవనిగడ్డ మండలంలో 1499 మందికి రూ.2.81 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్టు చెప్పారు. తో పాటు పలువురు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోడూరులో 2494 మందికి రూ.4.62కోట్ల చెక్కు పంపిణీ

కోడూరు: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలిచి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేశారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు వెలుగు కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత వేడుకలను సోమవారం పండుగలాగా నిర్వహించారు. అవనిగడ్డ ఏరియా కో-ఆర్డినేటర్ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మండలంలోని 2494 మందికి నాల్గవ విడత చేయూత కింద విడుదలైన రూ.4.67కోట్ల నగదు చెక్కును రమేష్‌బాబు అందించారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలశౌరి తీరుపై మండిపాటు..

వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలో చేరిన బాలశౌరి తీరుపై రమేష్‌బాబు మండిపడ్డారు. జగన్‌మోహన్ రెడ్డి పేరు చెప్పుకుని గెలిచిన బాలశౌరి నేడు పార్టీ మారి ఇష్టానుసారంగా మాట్లాడడం సమజసం కాదని హితవు పలికారు. కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిని నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని రమేష్‌బాబు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ రైతు విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, ఎంపీపీ తుంగల సుమతీదేవి, పలువురు జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీకి తాగునీటి సరఫరా

అవనిగడ్డ: స్థానిక కొత్తపేట రోడ్డులోని ఆర్టీసీ కాలనీకి తాగునీటి సరఫరాను సోమవారం సర్పంచ్ గొరుముచ్చు ఉమా ప్రారంభించారు. 20 సంవత్సరాల క్రితం కాలనీ ఏర్పడినప్పటికీ ఇక్కడ తాగునీటి పైపులైన్ లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశంతో సర్పంచ్ కాలనీకి తాగునీటి పైపు లైన్ ఏర్పాటుచేశారు. కాలనీవాసులు ఎమ్మెల్యే సింహాద్రికి, సర్పంచ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ మీటర్ల తనిఖీలు

అవనిగడ్డ: జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారి కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఐదు బృందాలు సోమవారం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మీటర్లను ఆకస్మిక తనిఖీ చేశాయి. 2,199 గృహ, 58 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేయగా, వీటిలో 198 సర్వీసులకు చెందిన వారు అక్రమంగా విద్యుత్ వాడుకోవడాన్ని గుర్తించారు. వారి నుంచి రూ.4,92,000 అపరాధ రుసుము వసూలు చేసినట్టు తెలిపారు.

మహిళల సాధికారతే జగనన్న లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



ద్వాక్రా మహిళలకు చేయూత చెక్కును అందజేస్తున్న హారిక, రాము

బంటుమిల్లి: రాష్ట్రంలో మహిళల సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో సోమవారం వైఎస్సార్ చేయూత 4వ విడత చెక్కును పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)తో కలసి ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఉప్పాల రామును ఎమ్మెల్యేగా, జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుని మహిళలు రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు.

టీడీపీ వేధింపులకు వెరవలేదు...

టీడీపీ నాయకులు అనేక రకాలుగా తన తండ్రి ఉప్పాల రాంప్రసాదును వేధించినా వెరవకుండా తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగామని పెడన నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. తనకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. తొలుత చైర్‌పర్సన్ హారిక, ఇన్‌చార్జి రాముకు ద్వాక్రా సభ్యులు ఘన స్వాగతం పలికారు. తర్వాత బుక్ కీపర్లు, ద్వాక్రా లీడర్లతో కలసి వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మండల పరిధిలోని 3190 మంది ద్వాక్రా సభ్యులకు చేయూత నిధులు సుమారు రూ.6 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిధిలోని రామవరపుమోడి గ్రామంలో ఉప్పాల రాము ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు.

ఇరిగేషన్ కార్యాలయం ప్రారంభం



ఇరిగేషన్ కార్యాలయ నూతన భవనం శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే సింహాద్రి తదితరులు

మర్రిపాలెం(నాగాయలంక): నాగాయలంక గ్రామం సమీపంలోని మర్రిపాలెం వంతెన సెంటర్‌లో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇరిగేషన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, దివి సౌత్ సెక్షన్ కార్యాలయాల సముదాయ భవనాన్ని అవనిగడ్డ ఎంఎల్ఏ సింహాద్రి రమేష్ బాబు సోమవారం ప్రారంభించారు. శాఖ ఆపరేషన్స్ అండ్ మెయింటినెన్స్ నిధులు రూ.33 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇరిగేషన్ కార్యాలయం అందుబాటులో ఉంటే రైతాంగానికి విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ రైతువిభాగం మూడుజిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులుకు గురి కాకూడదనే అన్ని సేవలను సమీక్ష్యతం చేస్తూ జగనన్న రైతు భరోసా కేంద్రాలను నిర్మించి గ్రామాల్లో అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, ఇరిగేషన్ డీఈఈలు ఆర్.రవికిరణ్, పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ పొన్నూరు రవితేజ, జేఈలు విజయకుమార్, జనార్దన్, జల వనరులు, డ్రైనేజీ శాఖల సిబ్బంది, రైతులు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నాంచారమ్మ గ్రామోత్సవం

- తొలిపూజలు చేసిన కొండవీటి వంశీయులు
- ఈ నెల 24,25 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడి సంబరం

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గ్రామోత్సవాన్ని దేవదాయ అధికారులు సోమవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన కొండవీటి వంశీయులు తొలి పూజలు చేసి ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆలయంలో ప్రధానార్చకుడు ఘంటసాల జైపార్థసారథి మంత్రోచ్ఛరణల నడుమ రామినీడు ఉత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ చిన్న అమ్మవారి గర్భాలయం నుంచి బయటకు తీశారు. అన్నంరాశిని సమర్పించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా చిన్న అమ్మవారి కొండవీటి వంశీయుల ఇళ్లకు తీసుకువెళ్లి పూజలు చేశారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారికి హారతులు పట్టి భక్తిభావం చాటారు. యువకులు కత్తి, కర్రసాము, వీరతాడుతో విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు.

ఇచ్చిన మాట నిలుపుకొన్నాం..ఆశీర్వదించండి

- జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, పెడన ఇన్‌చార్జ్ రాము
- రూ.1.10 కోట్లతో తాగునీటి పనులు పూర్తి
- ఏళ్ల తరబడి ఉన్న 16 గ్రామాల ప్రజల సమస్య పరిష్కారం



మల్లేశ్వరం వాటర్‌స్కీం ఫిల్టర్‌బెడ్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము తదితరులు

కృత్తివెన్ను: ఇచ్చిన మాట ప్రకారం 16 గ్రామాలకు గత కొన్నేళ్లుగా ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించామని, తమను ఆశీర్వదించాలని జెడ్పీచైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రాము విజ్ఞప్తిచేశారు. రాము సుమారు 40 రోజుల క్రితం పెడన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్‌గా ఉప్పాల రాము బాధ్యతలు తీసుకుని గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ప్రజలు తమ తాగునీటి ఇబ్బందులు విన్నవించుకున్నారు. దీనిపై ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఉన్నతాధికారులతో చర్చించారు. సమస్యకు ప్రధాన కారణం మల్లేశ్వరం సీపీడబ్ల్యూఎస్ స్కీం ఫిల్టర్ బెడ్లు పాడైపోవడమేనని అధికారులు చెప్పారు. ఇందువలన కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలలోని 16 గ్రామాలకు చెందిన సుమారు 18 వేల మంది జనాభా స్వచ్ఛమైన తాగునీరు లభించక ఇబ్బంది పడుతున్నారు. ఉప్పాల రాము వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఉన్నతాధికారులతో చర్చించగా, రెండు ఫిల్టర్ బెడ్లకు ఒక్కొక్కదానికి రూ.30 లక్షల వంతున మరమ్మతుల నిమిత్తం జెడ్పీ నిధులను కేటాయించారు. పనులు చకచకా పూర్తి చేసి సోమవారం ప్రారంభించారు. వీటితో పాటు రామాపురం బైపాస్ పైపులైను కోసం రూ.17.5 లక్షలు కేటాయించినట్లు వివరించారు. బంటుమిల్లి ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులకు రూ.17.5 లక్షలు వెచ్చించి పూర్తిచేసి ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 7 సీపీడబ్ల్యూఎస్, 70 ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంల అభివృద్ధిని పూర్తిస్థాయిలో తాము తీసుకుని ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని అందజేస్తామని వారు తెలిపారు. మల్లేశ్వరం స్కీం నుంచి మల్లేశ్వరం దళితవాడకు రూ.5 లక్షల జెడ్పీ నిధులతో 670 మీటర్ల మేర 3 అంగుళాల పైపులైను పనులకు సోమవారం రాము శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బంటుమిల్లి ఎంపీపీ చినబాబు, మల్లేశ్వరం, బంటుమిల్లి ఎంపీటీసీలు వీరబాబు, కమాల్‌బాషా, బంటుమిల్లి సర్పంచ్ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ కె.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డీఈఈ నటరాజ్, ఏఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దళితులకు వైఎస్సార్ సీపీతోనే న్యాయం

దళితుల ఆత్మీయ సమావేశంలో ఉప్పాల రాము



దళితుల ఆత్మీయ సమ్మేళనంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉప్పాల రాము

పెడన: దళితులను అక్కున చేర్చుకోవడమే కాకుండా వారికి సముచిత స్థానం కల్పిస్తూ పదవులు ఇచ్చింది వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. బంటుమిల్లి రోడ్డులోని పెడన ఫంక్షన్ హాలులో సోమవారం రాత్రి పెడన నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెడన 9వ వార్డు కౌన్సిలర్, అంబేడ్కర్ కమిటీ నాయకుడు గరికిముక్కు చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామును పలువురు దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ పాలడుగు బాబురావు, మునిపల్లి అబ్రహాం, మహంతి, విజయ రాజు, జై భీమ్ ఆర్మీ కమిటీ వైస్‌ప్రెసిడెంట్, కృత్తివెన్ను ఈదా కిషోర్, కృత్తివెన్ను తాతయ్య, పెనుమాల సునీల్, గరికముక్కు ప్రదీప్, లంక సుబ్రహ్మణ్యం, నల్లగంగుల సాల్మన్‌రాజు, మద్దాల నరేష్, పాము పుష్ప, దళిత యువజన నాయకులు, అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



కోనేరుసెంటర్: పేదల పక్షాన నిలబడి పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలని తెలిపారు. మండల పరిధిలోని తాళ్లపాలెంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వాలిశెట్టి రవిశంకర్, సర్పంచ్ మధిరి అశ్విని, కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలో ఉత్తర చిరువోలులంక పరిధిలోని రెడ్రాతుపాలెంలో రోడ్డు నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరకట్టపై కృష్ణానది వైపునకు కలిసే రెండు రోడ్ల కూడలి వరకు సుమారు 450 మీటర్ల పొడవునా రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఘనంగా సంపటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: చల్లపల్లి గ్రామదేవత శ్రీ సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి

పెడన: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని జింజేరు, దేవరపల్లి పాల ఉత్పత్తిదారుల సంఘాలను సందర్శించి సభ్యులను కలిశారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై యువకుడి ఆత్మహత్య

ముద్దనూరు(వైఎస్సార్ కడపజిల్లా): స్థానిక రైల్వేస్టేషన్‌లోని 1వ నంబరు ప్లాట్‌ఫాంపై సోమవారం సాయంత్రం ప్రసన్న బాలాజీ(37) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజారాంరెడ్డి సమాచారం మేరకు కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన బాలాజీ స్థానిక పాతవీధిలో నివాసముంటున్నాడు. అతని భార్య నర్సుగా పనిచేస్తోంది. కుటుంబ సమస్యల కారణంగా బాలాజీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.150 కోట్ల కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం

14 అత్యవసర, 4 టేబుల్ అజెండా అంశాలకు ఆమోదం



బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం సోమవారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రూ.150.02 కోట్లతో రూపొందించిన బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయిస్తూ సహకరిస్తోందన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున మంజూరు చేశారన్నారు. రూ.5,500 కోట్లతో పోర్టు నిర్మాణం, రూ.422 కోట్లతో ఫిషింగ్ హార్బర్ వంటి భారీ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.550 కోట్లతో మెడికల్ కళాశాలను పూర్తి చేసి తరగతులను ప్రారంభించారన్నారు. మెడికల్ కళాశాలకు తాగునీరు అందించేందుకు పైప్‌లైన్ కూడా నిర్మించామన్నారు. రూ.10 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. రూ.2.44 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయిందని ఈ నెల 12న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నగరంలో పలు సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇంకా అనేక అభివృద్ధి పనులను చేపట్టామని, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే పేర్ని నాని, మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్ ఇలా...

2024-25 వ సంవత్సర బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తే రూ.150.02 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సాధారణ పద్దులో ప్రారంభ నిల్వ రూ.12.02 కోట్లు, ఆదాయం రూ.145.61 కోట్లు, వ్యయం రూ.150.02 కోట్లు, ముగింపు నిల్వ రూ.7.61 కోట్లుగా చూపారు. 2023-24 సవరించిన బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తే ప్రారంభ నిల్వ రూ.8.19 కోట్లు, ఆదాయం రూ.52.43 కోట్లు, వ్యయం రూ. 45.60 కోట్లు, ముగింపు నిల్వ రూ. 15.02 కోట్లుగా చూపారు. బడ్జెట్‌ను అకౌంట్ విభాగం బీ-2 క్లర్క్ సీహెచ్ మోహన్‌గోపాల్, మేయర్ సీసీ కళ్యాణ్ చదివి వినిపించారు. బడ్జెట్‌లోని అంశాలపై టీడీపీ సభ్యులు సందేహాలను సీనియర్ కార్పొరేటర్ మేకల సుబ్బన్న, కమిషనర్ బాపిరాజు, డీఈ సాంబశివరావు, ఏఈ సాయిప్రసాద్ సమాధానమిచ్చారు.

14 అత్యవసర, 4 టేబుల్ అజెండా అంశాలకు ఆమోదం

బడ్జెట్ సమావేశం ముగిసిన అనంతరం 14 అంశాలతో కూడిన అజెండాతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఈ అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నాలుగు అంశాలతో టేబుల్ అజెండాకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ఈ 18 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలపటంతో రానున్న రోజుల్లో ఈ అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు. సమావేశంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.